క్లుప్తంగా

న్యాయం చేయాలని వినతి

రంగంపేట: రంగంపేట రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి స్పందన కార్యక్రమంలో ఒక అర్జీ అందినట్లు తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. ఏడీబీ రోడ్డు విస్తరణలో సగం ఇల్లు కోల్పోవడంతో మిగతా స్థలంలో ఇల్లు నిర్మించుకుంటుంటే గ్రామ ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు కట్టడానికి వీల్లేదంటూ బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలని రంగంపేట గ్రామానికి చెందిన ర్యాలి వీరభద్రరావు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ కుందేటి ప్రసాద్, సత్రం ఈఓ రాంబాబు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ చలివేంద్రంలో ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేస్తారని నిర్వాహకుడు ఈఓ రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఆకుల శ్రీను, వార్డు సభ్యుడు ప్రగడ చక్రి, ఉప్పుల అబ్బులు, అంకం సాయిబాబా, వై.నాగేశ్వరరావు, సంగీత ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) ద్వారా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులపై మండల స్థాయిలో బుధవారం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద జరిగే ఈ కార్యక్రమానికి సంబంధిత ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా హాజరుకావాలని ఎంపీడీఓ బి.రామారావు విజ్ఞప్తి చేశారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

సీతానగరం: మండలంలోని వంగలపూడి, పురుషోత్తపట్నం తదితర గ్రామాల ఏటిగట్టుపై వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీ వచ్చిందని ఎంపీడీవో కె.రమేష్ తెలిపారు. కొన్ని గ్రామాల వద్ద ఏటిగట్టుపై వీధిలైట్లు లేకపోవడంతో పలు ఇబ్బందులు పడుతున్నామని సీతానగరానికి చెందిన శివ అర్జీ అందజేశారన్నారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బిక్కవోలు: మద్యం అక్రమంగా తరలిస్తున్న తొస్సిపూడి గ్రామానికి చెందిన చింతా సత్యనారాయణరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ జి.వెంకటలక్ష్మి సోమవారం తెలిపారు. అతడి నుంచి 180 ఎంఎల్ బాటిళ్లు 10 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించి రాజమహేంద్రవరం జైలుకు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటలక్ష్మి తెలిపారు.

689 మందికి వైద్యసేవలు



రాపాకలో ఇంటివద్ద ఉన్న రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రాపాకలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు 689 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎం రోజా, ఆశవర్కర్లు లలిత, లక్ష్మి, మణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు న్యాయం చేయాలి

రాజానగరం: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించి, వారికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగుల ఫెడరేషన్ జోనల్ కన్వీనర్ డాక్టర్ వాలువ కనకరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఇచ్చిన, ఇవ్వని ఎన్నో హామీలను నెరవేరుస్తూ వస్తున్న సీఎం జగన్ తమ విషయంలో కూడా సముచిత నిర్ణయం తీసుకోవాలని వేడుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో నియమితులైన తమలో కొంతమందిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించిన విషయాన్ని ప్రస్తావిస్తూ ఏపీలో ఉన్న వారికి కూడా క్రమబద్ధీకరించాలని కోరారు.

రేపు మండల పరిషత్ సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరై మండలాభివృద్ధిపై చర్చించాలన్నారు.

భూమికి సారం.. రైతుకు మేలు

- పచ్చిరొట్ట సాగుకు సరైన సమయమిది
- రసాయన ఎరువులు తగ్గించుకోవడానికి మార్గం



పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే జీలుగు పైరు

పెదపూడి: రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రబీ అనంతరం మూడో పంటగా పలువురు రైతులు అపరాలు పండిస్తుంటే మరికొందరు పచ్చిరొట్టను సాగు చేస్తుంటారు. రసాయన ఎరువుల వాడకం పెరిగిపోతున్న కారణంగా భూసారం తగ్గిపోతుంది. అందుకే రైతులు భూసారం పెంచుకునేందుకు రబీ పంటల అనంతరం చేలల్లో పచ్చిరొట్ట పైరును పెంచడం ఎంతో మంచిదని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు. తద్వారా రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోడానికి వీలుంటుందంటున్నారు. పచ్చిరొట్ట సాగుకు సంబంధించి పలు విషయాలను మండల వ్యవసాధికారి టీవీఆర్ మణిదీప్ వివరించారు.

స్థూల పోషకాలు అధికం

రబీ సీజన్‌లో అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని ఏడు మండలాల్లో 57,442 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. పంట సాగులో రైతులు గుళికలను అధికంగా వాడటంతో భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనల్లో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్లు స్పష్టమైంది. దానివల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. సూక్ష్మజీవులు తిరిగి పెరగడానికి సైతం పచ్చిరొట్ట సాగు ఉపయోగపడుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకునేందుకు ఇదే సరైన సమయం. జనుము, జీలుగ, పిల్లి పెసర, ఉలవ, నీలి తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకూ పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకూ ఉంటాయి.

స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు సైతం భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. పచ్చిరొట్ట సాగుతో 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. రైతులు ఆర్థికంగా లాభపడటానికి పచ్చిరొట్ట పైర్లు దోహదం చేస్తాయి. ప్రస్తుతం ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో పచ్చిరొట్ట పైర్ల సాగుతో ఎంతో మేలు కలుగుతుంది.

పచ్చిరొట్ట పైర్లతో ఎంతో మేలు



పచ్చిరొట్ట పైర్లతో ఎంతో మేలు కలుగుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలిగియదున్నడంతో సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సహజంగా చౌడు బారిపోయిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది. పైగా రసాయనిక ఎరువుల వినియోగం సైతం తగ్గుతుంది.

– టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయాధికారి

గంజాయి స్వాధీనం : ముగ్గురి అరెస్టు



నిందితులు, గంజాయితో పోలీసులు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పట్టుకున్నట్టు ఇన్‌చార్జి ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. సోమవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం, గోరింట, పెద్దాపురం గ్రామాలకు చెందిన ఆకుల సాయి కిరణ్, పిల్లి చిన్న కుమార్ రాజా, గునుపూడి వర ప్రసాద్ కొంత కాలంగా పెద్దాపురం మండలం గోరింట గ్రామానికి చెందిన అన్నదమ్ములైన గంటా వీర్రాజు, గంటా స్వామి, వారవారి స్నేహితుడైన విశాల్‌తో కలసి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. నర్సీపట్నం అటవీ ప్రాంతంలో గంజాయి కొని తమిళనాడు తీసుకువెళ్లి అధిక సొమ్ముకు విక్రయిస్తున్నారు. దీనిలో భాగంగా చెన్నైకి చెందిన పాండ్యన్ 25 కేజీల గంజాయి కావాలని కోరగా, వారం రోజుల క్రితం చింతపల్లి పరిసర అటవీ ప్రాంతంలో రూ.2 వేల చొప్పున 25 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. దానిని సోమవారం రాజానగరం వద్ద పాండ్యన్‌కు అందించాలని నిర్ణయించుకున్నారు. ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం పైలెట్‌గా బైక్‌పై వీర్రాజు, గంటా స్వామి, విశాల్ ముందు వెళ్లారు. వెనుక కారులో గంజాయితో ఆకుల సాయి కిరణ్, పిల్లి చిన్న కుమార్ రాజా, గునుపూడి వర ప్రసాద్ వెళ్లసాగారు. ఈ నేపథ్యంలో పోలీసులు రంగంపేట ఏడీబీ మెయిన్ రోడ్డులో ప్రభుత్వ వైన్‌షాపు వద్ద కారుతో పాటు 24.900 కేజీల గంజాయి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనపర్తి సీఐ వి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిప్పుల కొలిమి



మధ్యాహ్నం 3 గంటలకు నిర్మానుష్యంగా అనపర్తి వివేకానంద సెంటర్

అనపర్తి: గత ఐదు రోజులుగా భానుడు ఉగ్రరూపం దాల్చి నిప్పులు కురిపిస్తుండటంతో ప్రజలు అల్లాడుతున్నారు. ఎర్రటి ఎండకు నీడపట్టున ఉన్న నీళ్లు కూడా సలసల కాగుతున్నాయి. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరగటంతో ఉదయం తొమ్మిది గంటలకే ఎండ సుర్రుమంటోంది. ఉదయం 10 గంటలు దాటితే అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావాలంటే ప్రజలు హడలెత్తిపోతున్నారు. భానుడి ప్రతాపానికి రద్దీగా ఉండే ప్రాంతాలు, రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సోమవారం అనపర్తిలో సుమారు 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండలు పెరగడంతో తోపుడు బళ్లు, సైకిళ్లపై వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు తమ ఉపాధికి గండి పడిందని వాపోతున్నారు. వేసవి తాపం వల్ల పుచ్చకాయలు, శీతల పానీయాలు, కొబ్బరి బొండాలకు డిమాండ్ పెరిగింది.

డెల్టా ప్రాంత రైతుల ఆరాధ్యదైవం కాటన్



రామవరంలో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి



కాటన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు

అనపర్తి: అఖండ గోదావరిపై ఆనకట్ట నిర్మించిన సర్ ఆర్థర్ కాటన్ డెల్టా ప్రాంత రైతుల ఆరాధ్య దైవమని అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ 220వ జయంతిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని రామవరం కెనాల్ రేవులోని కాటన్ విగ్రహానికి పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలనలో నీటి పారుదలశాఖ ఇంజినీరుగా భారతదేశానికి వచ్చిన కాటన్ మహాశయుడు 1852లో ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించారని, ఆయన చలవ వల్లే గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా పేరొందాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరడా గంగాభవాని, ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, గొలుగూరి గౌతమి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గొలుగూరి గోవిందరెడ్డి, పార్టీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, కర్రి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాటన్ సేవలు ఆదర్శనీయం

రాజానగరం: గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ సేవలు ఆదర్శనీయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. కాటన్ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీలోని ఈసీ హాలులో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన ధవళేశ్వరం వద్ద కట్టించిన ఆనకట్ట కారణంగానే గోదావరి జిల్లాలు ధాన్యాగారంగా విరాజిల్లుతున్నాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, అధ్యాపకులు ఆచార్య కె.రమణేశ్వరి, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఆచార్య వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.పెర్సిస్, డాక్టర్ ఎ.మట్టారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ దొర జయంతి

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో సర్ ఆర్థర్ కాటన్ 220వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా బహుజన్ ఆర్మీ నాయకులు కరుపోతు నవీన్‌కుమార్ తదితరులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొంకుదురు, బిక్కవోలు, ఆర్ఎస్‌పేట, బలభద్రపురం గ్రామాల్లో కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1996–97లో పదో తరగతి చదువుకున్న వీరందరూ సోమవారం కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులు 18 మందిని సత్కరించారు. మట్ట శ్రీనివాస్, చింతలపూడి వీరబాబు, తోరం శోభనబాబు, సాంబశివరావు, కొండ్రపు శ్రీను, వలీ, రత్నమాల, అన్నపూర్ణ, శ్రీవల్లీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా సీఎం జగన్ వెంటే



గంద్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- గంద్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: రాష్ట్ర ప్రజలంతా సీఎం జగన్ వెంటే ఉన్నారని, ఆయన్ను మళ్లీ సీఎంగా గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గంద్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు పొందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం టీడీపీ నాయకులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో నేరుగా సంక్షేమ పథకాలు పేదల ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. సంక్షేమ సారథి జగనన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం సుభిక్షంగా ఉందని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. మళ్లీ జగనన్నే అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శివకుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్రి శ్రీను, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి మత్తు మందిచ్చి చోరీ

బిక్కవోలు: వృద్ధురాలికి ప్రసాదంలో మత్తు మందు కలిపిచ్చి చోరీకి పాల్పడిన ఘటన పందలపాకలో చోటుచేసుకుంది. ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 11వ తేదీన పందలపాక జెండా సెంటర్ సమీపంలో ఒంటరిగా నివాసముంటున్న గొలుగూరి ఆదిలక్ష్మి అనే వృద్ధురాలి ఇంటికి గుర్తు తెలియని మహిళ వచ్చి దేవుడి ప్రసాదం తినమని ఇచ్చింది. ప్రసాదం తిన్న కొంతసేపటికే ఆమె స్పృహ తప్పిపోయింది. వృద్ధురాలు వడదెబ్బకో, బీపీ ఎక్కువయ్యో పడిపోయి ఉంటుందనుకున్న ఆమె కోడలు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చిన వృద్ధురాలు జరిగిన విషయం చెప్పడంతో కుటుంబసభ్యులు ఇంట్లో వెతకగా బీరువాలో ఉండాల్సిన మూడు కాసుల బంగారపు తాడు మాయమైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

పెళ్లి వేడుకలో ఇరువర్గాల ఘర్షణ

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో సోమవారం జరిగిన పెళ్లి వేడుకలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి, పలువురికి గాయాలయ్యాయి. రామచంద్రపురానికి చెందిన జిత్తుగ సుబ్రహ్మణ్యం (సుబ్బారావు)కు, తాళ్లపూడి మండలం గజ్జరానికి చెందిన శ్రీపూజితతో రామచంద్రపురంలో వివాహమైంది. ఈ నేపథ్యంలో పెళ్లికుమార్తెను డ్యాన్స్ చేయమని పెళ్లికొడుకు బంధువులు ఒత్తిడి చేయడంతో, పెళ్లికుమార్తె అన్నయ్య తిరస్కరించాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తి దాడులకు దిగారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఇన్‌చార్జి ఎస్సై సత్యనారాయణ, సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి.. ఇరువర్గాలతో మాట్లాడి సఖ్యత కుదిర్చారు. అప్పటికే గాయాలైనవారు చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లారు. ఈ ఘటనపై ఇరువర్గాల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.